హామీలన్నీ నెరవేరుస్తున్నాం

- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు


మంచిర్యాల పట్టణంలో చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గత ప్రభుత్వ పథకాలను ఇవ్వమని ప్రచారం చేశారని, కానీ తాము గత పథకాలను కొనసాగిస్తూనే, తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్లో శనివారం 154మంది లబ్ధిదారులకు రూ.1,54,17,864 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ప్రస్తుతం తాము ఇస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులన్నీ కూడా గత ప్రభుత్వ హయాంలో పెండింగులో పెట్టినవేనని, వాటినే ఇప్పుడు ఇస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, నిత్యం ప్రజల సంక్షేమం, అభివృద్ధిని కోరుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్, తహసీల్దార్ రమేశ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మామిడిశెట్టి వసుంధర, కౌన్సిలర్లు నల్ల శంకర్, వేములపల్లి సంజీవ్, రామగిరి బానేశ్, మినాజుద్దీన్, మెరుగు మహేశ్వరి, జోగుల శ్రీలత, మాజీద్, రాజు, హరికృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేశ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రజిత, నాయకులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు అమలు

నస్పూర్: పేదల అభ్యున్నతికే ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. సీసీసీలోని సింగరేణి ఆఫీసర్స్ క్లబ్‌లో శనివారం ఆయన అర్హులైన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రతీ సంక్షేమ పథకం అందేలా కృషి చేస్తామని తెలిపారు. రూ.10వేల లోపు పెన్షన్ అందుకుంటున్న రిటైర్డ్ సింగరేణి కార్మికులకు తెల్లరేషన్ కార్డులు ఇప్పిస్తామని పేర్కొన్నారు. సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న వారికి, ఇళ్ల పట్టాలు అందిస్తామన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికై చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. కాగా 64మందికి కల్యాణ లక్ష్మి, నలుగురికి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ సురమిల్ల వేణు, వైస్ చైర్‌పర్సన్ గెల్లు రజిత, తహసీల్దార్ శ్రీనివాస్, కౌన్సిలర్లు తోట శ్రీనివాస్, పూదరి కుమార్, వంగ తిరుపతి, తెనుగు లావణ్య, బండి పద్మ, కో ఆప్షన్ మెంబర్ ఎండీ నాసర్, ఆర్ఐ మాంతయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- చెన్నూర్‌లో పలు కార్యాలయాలను సందర్శించిన కలెక్టర్


ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా కలెక్టర్ మున్సిపల్, తహసీల్ కార్యాలయాలతో పాటు 50పడకల ఆసుపత్రి, అర్బన్ పార్కులను శనివారం సందర్శించారు. ప్రజాపాలన సేవా కేంద్రాన్ని పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అభివృద్ధి పనుల వివరాలను మున్సిపల్ కమిషనర్ గంగాధర్‌ను అడిగి తెలుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అధికారులు సమన్వయంతో అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వార్డులలో మిషన్ భగీరథ తాగునీరు అందేలా చూడాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. వన నర్సరీలలో నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ధరణిలో అందిన దరఖాస్తులు క్షుణంగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ మల్లికార్జున్‌ను ఆదేశించారు. ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. వర్షాకాలం కావడంతో అంటువ్యాధులు, విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యులు సత్యనారాయణకు సూచించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. విధులపై అధికారులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సాయికిరణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


భీమారంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


దండేపల్లి: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రుణమాఫీపై కాంగ్రెస్ నాయకుల సంబురాలు

లక్సెట్టిపేట/దండేపల్లి/మందమర్రిరూరల్/భీమారం/కోటపల్లి/జైపూర్/చెన్నూర్/రామకృష్ణాపూర్: అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకిచ్చిన రూ.2లక్షల రుణమాఫీ హామీపై సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో మంత్రి వర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం ప్రకటించడం పై జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు శనివారం సంబురాలు జరిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.


చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో...

క్లుప్తంగా

ఉద్యోగ నియామక పత్రాల అందజేత


నియామకపత్రాలు అందుకున్న వారితో జీఎం మనోహర్, అధికారులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో శనివారం 24మంది డిపెండెంట్‌లకు ఏరియా జీఎం మనోహర్ ఉద్యోగ నియామకపత్రాలు అందించారు. జీఎం మాట్లాడుతూ.. సింగరేణిలో ఉద్యోగం రావడం అదృష్టంగా భావించి విధులు చక్కగా నిర్వర్తించాలని సూచించారు. ఇప్పటి వరకు ఏరియాలో 1830 డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. నూ తనంగా విధుల్లో చేరే ఉద్యోగులు సంస్థ నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్వో టు జీఎం రాజేశ్వరరెడ్డి, డీవైపీఎం మైత్రేయబంధు, సత్యబోస్, ఆఫీస్ సూపరింటెండెంట్ రాయలింగు, యూనియన్‌ల ప్రతినిధులు ఉన్నారు.

నిబంధనలు పాటించాలి


పాఠశాల బస్సును పరిశీలిస్తున్న అధికారులు

మంచిర్యాలక్రైం: విద్యాసంస్థల యాజమాన్యం పాఠశాల బస్సుల నియమ నిబంధనలు పాటించాలని మంచిర్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరేష్ అన్నారు. పట్టణంలోని కార్మల్ పాఠశాల బస్సులను శనివారం పరిశీలించి మాట్లాడారు. రామగుండం సీపీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు.. పాఠశాల బస్సుల ఫిట్‌నెస్‌లు, ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బస్సుల లోపల అగ్నిమాపక యంత్రం ఇతర సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీఎంఎస్ నేతలు


కిషన్‌రెడ్డితో భేటీ అయిన బీఎంఎస్ నేతలు

శ్రీరాంపూర్: సింగరేణి బీఎంఎస్ నాయకులు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని హైదరాబాద్‌లో శనివారం కలిశారు. తెలంగాణలోని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని కోరారు. సింగరేణిలో ఇటీవల నూతన బొగ్గు గనులు లేకపోవడం వలన సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. వేలంతో సంబంధం లేకుండా నేరుగా కంపెనీకి గనులు కేటాయించాలన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్కోల నుంచి రూ.29వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉందని, ప్రభుత్వంతో మాట్లాడి ఈ బకాయిలు వెంటనే ఇప్పించాలన్నారు. కిషన్‌రెడ్డిని కలిసిన వారిలో బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, కేంద్ర ఉపాధ్యక్షులు చాట్ల అశోక్, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెండ్లి మోహన్ రెడ్డి, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, యూనియన్ నాయకులు ఉన్నారు.

కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలి

మంచిర్యాలఅర్బన్: కార్పొరేట్ పాఠశాలల ఫీజులను అరికట్టాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో శనివారం ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థిసంఘాల నాయకులు మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏటా ఫీజులను పెంచుతున్నాయని ఆరోపించారు. పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాంలు విక్రయిస్తూ అదనపు భారాన్ని మోపుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి కార్పొరేట్ పాఠశాలలు వసూలు చేస్తున్న ఫీజులు, పుస్తకాల ధరలపై నియంత్రణ చట్టం చేసి తల్లిదండ్రులకు ఫీజుల భారంను తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎంఈవోల పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు శ్రీనివాస్, గోపాల్, ఆదర్శవర్ధన్‌రాజు, ప్రవీణ్, వంశీ, క్రాంతి, మధు, వేణు పాల్గొన్నారు.

వర్షాల కోసం పూజలు

తాండూర్: వర్షాల కోసం మహిళలు బోనమెత్తారు. వానాకాలం ప్రారంభమైనప్పటికీ విస్తారంగా వర్షాలు కురవకపోవడంతో మండలంలోని అచలాపూర్ గ్రామ పంచాయతీ కొమ్ముగూడెం గ్రామానికి చెందిన మహిళలు బోనాలతో పోచమ్మ, గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించారు. బెల్లం, పానకాలను నైవేద్యంగా సమర్పించి వర్షాలు పుష్కలంగా కురవాలని అమ్మవార్లను వేడుకున్నారు.

హోటళ్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు


లక్సెట్టిపేట: విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారి

జన్నారం/లక్సెట్టిపేట: హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో నాణ్యమైన ఆహారం అందించాలని, కల్తీ చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వాసురామ్ హెచ్చరించారు. జన్నారం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో చికెన్‌కు రంగు వేసినట్లు గుర్తించి వాటిని చెత్త కుండిలో పడేశారు. మరోసారి ఇలా జరిగితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. లక్సెట్టిపేటలో సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాల, మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలను సందర్శించి, హాస్టల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట గదిలోని వంట సామగ్రి, సరుకులు, కూరగాయలు పరిశీలించారు. పాడైపోయిన ఆహారం, కుళ్లిన కూరగాయలను విద్యార్థులకు అందించవద్దని సూచించారు. పాఠశాలలో సౌకర్యాలు, రికార్డులు పరిశీలించారు. సబార్డినేటర్ షకీల్ ఉన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి


ఆర్డీవోకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో అంబేద్కర్ భవనం కోసం కేటాయించిన స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణకు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు మాసం మురళి, గోమాస రాజం, సబ్బని రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాలకు ఎస్‌జీటీల రాజీనామా


నిరసన తెలుపుతున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయులు

కాసిపేట: మండలంలో పనిచేస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయులు శనివారం సమావేశమై పదోన్నతులలో జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ వివిధ సంఘాలకు ఎస్‌జీటీలు రాజీనామా చేసి నిరసన తెలిపారు. వివిధ సంఘాలు ఎస్‌జీటీలను ద్వితీయ శ్రేణి ఉపాధ్యాయులుగా భావిస్తూ, వారు చూపుతున్న వివక్షతను ఖండిస్తూ అధిక సంఖ్యలో ఉన్న ఎస్‌జీటీలు మూకుమ్మడిగా సంఘాలకు, పదవులకు ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీటీ జేఏసీ నాయకులు వేల్పుల కిరణ్‌కుమార్, సురేష్, శారద, రాధిక, ప్రకాష్, సతీష్, అర్పిత, రాజయ్య, వరలక్ష్మి, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

చిరు వర్షానికే చిత్తడి


రాయిపేట గ్రామానికి వెళ్లే దారిలో...


సీసీసీ కార్నర్ వద్ద జాతీయ రహదారిపై...

చెన్నూర్‌రూరల్: చిరు వర్షానికే రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. కురుస్తున్న చిన్నపాటి వర్షానికి మండలంలోని రాయిపేట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి చెరువుకట్టపై ఉన్న రోడ్డు మొత్తం బురదమయంగా మారింది. మట్టి రోడ్డు కావడంతో గుంతలు ఏర్పడి అందులో వర్షపు నీరు నిలుస్తుంది. ద్విచక్రవాహనాలు వెళ్లలేని దుస్థితి నెలకొంది. అధికారులు పట్టించుకొని బీటి రోడ్డు నిర్మించి ఈ కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

నస్పూర్: పట్టణంలో శనివారం మధ్యాహ్నం అర్ధగంట పాటు కురిసిన వర్షానికే సీసీసీ కార్నర్ వద్ద నర్సయ్య భవన్ సమీపంలో జాతీయ రహదారి జలమయమైంది. దీంతో రహదారి పై నుండి వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షాకాలం ప్రారంభం అయినా సంబంధిత అధికారులు డ్రెయినేజీల్లోని చెత్తా చెదారాన్ని తొలగించక పోవడంతో మురుగు నీరు రోడ్డుపై ప్రవహించింది. వర్షాకాలం దృష్ట్యా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రెయినేజీలలోని చెత్తాచెదారాన్ని తొలగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమ నిర్మాణం కూల్చేయాలని ఆందోళన


మున్సిపల్ ఆఫీస్ ముందు బైఠాయించిన బాధితులు

మందమర్రిరూరల్: మందమర్రి శివారులోని చొప్పరిపల్లె సమీపంలో తనకు వారసత్వంగా వచ్చిన ఎకరం భూమిలో అక్రమంగా వేరే వ్యక్తి నిర్మాణం చేపడుతున్నారని, అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసి నా భూమి నాకిప్పించండని వడాల దుర్గమ్మ అనే బాధిత మహిళ శనివారం స్థానిక మున్సిపల్ ఆఫీస్ గేట్ ముందు బైఠాయించింది. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు వారం రోజుల్లో చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు. బాధితురాలి వెంట కుటుంబసభ్యులు, బీఆర్ఎస్ నాయకులు ఎంపీ గుణ, భవాణి, వినోద, శిరీష, రజిత ఉన్నారు.

రాంగ్ పార్కింగ్ వాహనాలపై పోలీసుల కొరడా

చెన్నూర్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి చెరువు కట్ట వరకు నిత్యం రద్దీగా ఉంటుందని, ట్రాఫిక్ సమస్య వస్తుందని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం రాంగ్ పార్కింగ్ చేసిన వాహనదారులకు జరిమానా విధించినట్లు సీఐ రవీందర్ తెలిపారు. రాంగ్ పార్కింగ్ చేసిన 5 కార్లు, 30మోటర్ సైకిళ్ల యాజమానులకు జరిమానా విధించారు. పది షాపుల యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు శ్వేత, వెంకటేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఐటీ విద్యార్థికి ఆర్థిక వితరణ



బెల్లంపల్లి: దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఖరగ్‌పూర్ ఐఐటీలో సీటు సాధించిన బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీఓఈ) కళాశాల విద్యార్థికి దాతలు శనివారం ఆర్థికసాయం అందించి మానవత్వం చాటుకున్నారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులకు దూరమైన బెల్లంపల్లి మండలం చాకేపల్లి గ్రామానికి చెందిన దుర్గం చరణ్‌తేజ్‌ను పెద్దనాన్న దుర్గం వెంకటి చేరదీసి చదివించారు. కష్టపడి చదివి ఇంటర్‌లో సీఓఈలో చేరిన చరణ్‌తేజ్ జేఈఈ ప్రవేశ పరీక్షల్లో నెగ్గి ఐఐటీ సీటు సాధించి ప్రతిభ చాటుకున్నాడు. అయితే ఐఐటీలో చేరడానికి ఫీజు చెల్లించలేని పరిస్థితులు ఏర్పడటంతో చరణ్‌తేజ్ ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవికుమార్ రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. విద్యార్థి ప్రతిభను మెచ్చుకుని శాలువాతో సత్కరించి ప్రశంసించారు. బెల్లంపల్లి మార్వాడీ యువమంచ్ నిర్వాహకులు రూ.17,500 అందజేయగా, ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్‌వర్ధన్‌రాజు మరో రూ.17,500 అందించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

జన్నారం: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను శనివారం ఎస్సై రాజవర్ధన్ బాధితుడికి అప్పగించారు. ఎస్సై కథనం ప్రకారం.. ఈ నెల 7న జన్నారం మండలం పొనకల్‌కు చెందిన దోమల భాస్కర్ తన దుఖాణం వద్ద పెట్టిన మొబైల్ ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుపోయాడు. భాస్కర్ ఈ విషయంపై ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

దండేపల్లి: నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు విక్రయించే ప్రైవేటు పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జెల్లపెల్లి అంజన్న డిమాండ్ చేశారు. దండేపల్లిలో శనివారం సంఘనాయకులతో కలిసి సమావేశం అయ్యారు. ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, రాతపుస్తకాలు, యూనిఫాంను అధిక ధరలకు విక్రయిస్తూ, విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారని ఆరోపించారు.

ఐటీడీఏ ముట్టడిని విజయవంతం చేయాలి

తాండూర్: ఆదివాసీల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 24న చేపట్టబోయే ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ముట్టడి, ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి మండిగ రవీందర్ ఒక ప్రకటనలో కోరారు.

మిగులు సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలి

కాసిపేట: మండల కేంద్రంలోని కాసిపేట తెలంగాణ మోడల్‌స్కూల్లో 6వ తరగతి, 8, 9, 10తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు, ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6, 8, 9, 10 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ప్రవేశ పరీక్ష నిర్వహించి అడ్మిషన్ ఇవ్వనున్నట్లు విద్యార్థినీ, విద్యార్థులు ఈ నెల 25లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

ఇంటి నిర్మాణానికి సాయం

రామకృష్ణాపూర్: పట్టణంలోని విద్యానగర్ ఏరియాకు చెందిన నిరుపేద దివ్యాంగుడు నవీన్ ఇల్లు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా శిథిలావస్థకు చేరగా పట్టణానికి చెందిన పలువురు ఇంటి పునర్నిర్మాణానికి సహకరించారు. స్థానిక సింగరేణి ఎలక్ట్రీషియన్ కాంతరాజు సుమారు రూ.80వేల సాయం అందించగా, ఆర్‌కేపీ యువత సభ్యులు ఎర్రబెల్లి రాజేష్, శివకిరణ్, ఆర్నెసతీష్ తదితరులు శనివారం రేకులు అందించారు.

28న తైబజార్ వేలం

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో తైబజార్, పశువుల సంత ఫీజు వసూలు కోసం ఈ నెల 28న ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు మున్సిపాలిటీకి ఎలాంటి బకాయిలు లేనట్లుగా ధ్రువీకరణ పత్రం అందజేయాలని తెలిపారు. వేలానికి హాజరయ్యే వారు ఈ నెల 24నుంచి 27వరకు కార్యాలయం పని వేళలల్లో రూ.5వేలు చెల్లించి దరఖాస్తు ఫారాన్ని పొందాలని కోరారు.

వాహనాల తనిఖీ

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధిలో శనివారం రాత్రి పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. వన్‌టౌన్, టూ టౌన్ పరిధిలో పలు చోట్ల మకాం వేసి వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య, ఎస్సై రమేష్, పోలీసులు పాల్గొన్నారు.

వారసంత వేలం


మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో నిర్వహించే వారసంత బహిరంగ వేలం శనివారం హాజీపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించారు. జూలై 1వ తేదీ నుంచి 31మార్చి 2025 వరకు అంటే 9నెలలకు గాను నిర్వహించిన వేలంలో స్థానికుడు పూదరి పరంధాం రూ.81,500కు వేలంలో వారసంత దక్కించుకున్నాడు.


ఊరు పోచమ్మ కొలుపు

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో శనివారం ఊరి పోచమ్మ కొలువు ప్రారంభించారు. ఆదివారం మధ్యాహ్నం వరకు ఈ కొలుపు ఉండగా రచ్చపల్లి, కొమ్మెర, ముత్తరావుపల్లి, నర్సక్కపేట, పొక్కూరు, బీరెల్లి గ్రామాల రాకపోకలకు అంతరాయం ఉంటుందని స్థానికులు తెలిపారు. ఇతర గ్రామాల ప్రజలు అంగ్రాజ్‌పల్లి గ్రామం మీదుగా వెళ్లాలని గ్రామస్తులు సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవాలి


తాండూర్: అవగాహన కల్పిస్తున్న సీఐ కుమారస్వామి


భీమిని: మాట్లాడుతున్న ఎస్సై సంతోష్


ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై

తాండూర్: సమాజంలో జరుగుతున్న పలు రకాల నేరాలతో పాటు విద్యార్థినులు సైబర్ నేరాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని తాండూర్ సీఐ కుమారస్వామి అన్నారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డయల్ 100 సేవలు, 1098హెల్ప్‌లైన్ గురించి విద్యార్థినులకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఇన్‌చార్జి ప్రత్యేకాధికారి సుమన, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది రామానంద్, లక్ష్మణ్, శ్రీనివాస్, విద్యార్థినులు పాల్గొన్నారు.

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో సైబర్ నేరాలపై ఎస్సైలు విజయ్‌కుమార్, గంగారాంలు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. భీమిని మండలంలోని చిన్నగుడిపేట, కన్నెపల్లి మండలంలోని జజ్జరవెల్లి గ్రామపంచాయతీల్లో శనివారం గ్రామస్తులకు సైబర్‌నేరాల గూర్చి వివరించారు.

కాసిపేట: ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని కాసిపేట ఏఎస్సై రవీందర్ సూచించారు. మండల కేంద్రంలో సైబర్ మోసాలపై చైతన్యపర్చేందుకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్‌నేరాలు, క్రెడిట్ కార్డుల సంబంధిత మోసాలపై వివరిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు రాజేందర్, రాజు, రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి

చెన్నూర్: విద్యార్థులు జీవితంలో విజయం సాధించాలంటే ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని చెన్నూర్ ఎస్సై శ్వేత అన్నారు. స్థానిక చిన్న ముల్లి పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఉమెన్ సేఫ్టీ, ఆత్మ విశ్వాసం, ట్రాఫిక్ రూల్స్ పై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

శ్రీరాంపూర్: చిన్నప్పటి నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని శ్రీరాంపూర్ ఎస్సై సంతోశ్ విద్యార్థులకు సూచించారు. శ్రీరాంపూర్‌లోని కేరళ మోడల్ స్కూల్‌లో శనివారం సైబర్‌నేరాలు, షీటీం రక్షణ సైన్స్ ఆఫ్ సెక్యూరిటీ, డయల్ 100 వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుల 'పల్లెనిద్ర'


స్థానికులతో మాట్లాడుతున్న ఎస్సై ఆంజనేయులు

కాసిపేట: శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక శక్తుల కట్టడికి గ్రామాల్లో పోలీసులు రాత్రి బస చేయడం జరుగుతుందని దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్సై ఆంజనేయులు, పోలీసు సిబ్బంది శుక్రవారం రాత్రి సాలేగూడలో నిద్ర చేశారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా స్నేహభావంతో ఉండాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే పోలీసులను సంప్రదించాల్సిందిగా కోరారు.